చేసిన ప్యూమా షూస్ అందరి కళ్లలో పడేందుకు ఆటను నిలిపి మరీ వాటిని ముడి వేసుకున్నాడు. ఒకరిని మించి మరొకరు ఎదగాలనే తత్వంతో ప్యూమా, అడిడాస్ పాదరక్షల వ్యాపారంలో అనూహ్యమైన విజయాలు సొంతం చేసుకున్నాయి. అంతేకాదు! క్రీడాకారులకు సైతం ఉత్పత్తులు స్పాన్సర్ చేసే అవకాశం పెంచి, ఓ గొప్ప ఆదాయమార్గాన్ని నిర్మించాయి.





**వ్యాపారంలో పోటీ ఉండాల్సిందే!**

ఏదైనా వ్యాపార-సేవారంగంలో ఒకే సంస్థ ఉంటే... ఇక తన షరతుల ప్రకారం నడుచుకోవాల్సిందే! అందుకే Monopolies and Restrictive Trade Practices లాంటి చట్టాలను తీసుకువచ్చాయి ప్రభుత్వాలు. ఇతర సంస్థలను గమనించకపోతే మారుతున్న కాలం, అభిరుచులు, సాంకేతికతల మీద పట్టు చిక్కదు. కొడాక్, యాహూ, పొలరాయిడ్ లాంటి కంపెనీలు విఫలం కావడానికి కారణమిదే. అంతేకాదు!

- వినియోగదారులను ఆకర్షించేందుకు ఏదో ఒకటి కొత్తగా రూపొందించాలనే తపన ఉంటుంది. యాపిల్, సామ్‌సంగ్ ఫోన్లే ఇందుకు ఉదాహరణ. ఆ ప్రయత్నం చేయలేదు కాబట్టే నోకియా విఫలమైంది.
- పోటీ లేని చోట ఉత్పత్తిలో ఏదన్నా సమస్య ఉంటే, దాన్ని తీర్చేందుకు కూడా అలసత్వం ఉంటుంది. పోటీ ఉంటే వినియోగదారుడు చేజారిపోకూడదు, సేవల విషయంలో కంపెనీ ప్రతిష్ఠ దెబ్బతినకూడదు అనే జాగ్రత్త ఉంటుంది.
- ధరలను అందుబాటులోకి తీసుకురావాలనే ప్రయత్నం పోటీ వాతావరణంలో కనిపిస్తుంది. కొన్నేళ్లుగా ఫోన్లు, టీవీలు, కార్ల ధరలలో అనూహ్యమైన పెరుగుదల లేకపోవడానికి కారణం... ఆయా ఉత్పత్తులకు ఉన్న గిరాకీని పూర్తిగా వినియోగించుకోవాలనే జాగ్రత్తే!
- ఒకప్పుడు ఏదన్నా పచారీ వస్తువు కావాలంటే పనిగట్టుకు వెళ్లాల్సిందే. కానీ అవే ఇప్పుడు ఇంటి ముందుకు వస్తున్నాయి. అది కూడా పదినిమిషాల్లో. పోటీతత్వంలో ఉత్పత్తి మాత్రమే కాదు, దాన్ని వినియోగదారుడికి ఎంత తేలికగా అందించగలం అనే సౌలభ్యం కూడా ప్రభావం చూపిస్తుంది.

**పోటీ ఇలా అయితేనే ఆరోగ్యకరం!**

పోటీ అన్న మాట వింటేనే మనకు కాస్త ప్రతికూలమైన భావనలు స్ఫురిస్తాయి. అది సహజమే! గెలవాలనే పట్టుదలకు అహంకారం తోడైతే.. అడ్డదారులూ, అక్రమ మార్గాలూ గుర్తుకొస్తాయి. అందుకే హుందాగా ఉండే పోటీకి కొన్ని లక్షణాలు సూచిస్తున్నారు.

- గెలుపు మీదికంటే ఎదుగుదల మీదే దృష్టి పెట్టాలి. ఆ ప్రయత్నం నేర్పునీ, సృజననీ మెరుగుపరుస్తుంది.
- సాధ్యమైన లక్ష్యాలనే పెట్టుకోవాలి. దానికోసం ప్రణాళిక ఏర్పరుచుకోవాలి. ఎప్పటికప్పుడు ప్రయాణాన్ని గమనించుకోవాలి.
- ఇతరుల మీద గెలిస్తేనే కాదు, మన ప్రయాణంలో ప్రతి మజిలీని కూడా సెలెబ్రేట్ చేసుకోవచ్చు.
- పోటీదారుడు శత్రువు కాదు! తనతో ఆలోచనలను పంచుకోవడం, అవసరమైనప్పుడు కలిసి పనిచేయడం వల్ల అందరూ ఎదుగుతారు.
- పోటీకి, పోలికకు చాలా తేడా ఉంది. పోలికకు కారణంతో పని ఉండదు, పరిమితీ ఉండదు. ఆ పరుగుకు న్యూనతే ఇంధనంగా మారుతుంది.

**ప్రతీ రంగంలోనూ అద్భుతాలే!**

ఆరోగ్యకరమైన పోటీ వల్ల ప్రతి రంగంలోనూ అనూహ్యమైన వృద్ధి జరిగినట్టు చరిత్రే చెబుతున్నది.

- ప్రపంచంలోనే గొప్ప చిత్రకారులు ఎవరు అంటే లియొనార్డో డావించీ, మైఖలాంజిలో పేర్లు తప్పక గుర్తుకొస్తాయి. ఆ ఇద్దరి మధ్యా సాగిన ఆధిపత్య పోరే... ఒకరిని మించి మరొకరు బొమ్మలు గీసేలా, మిగతా కళాకారులను ప్రోత్సహించేలా చేసిందని చెబుతారు. ఇద్దరి మధ్యా 20 ఏళ్ల వ్యత్యాసం ఉన్నప్పటికీ, దీటుగా పోటీపడేవారు. ఒకే తరహా బొమ్మను ఇద్దరూ పోటాపోటీగా గీయడానికి ప్రయత్నించిన సందర్భాలూ ఉన్నాయి.
- భారత్, పాకిస్తాన్‌ల మధ్య క్రికెట్ మ్యాచ్ జరిగితే ఎలా ఉంటుందో తెలిసిందే. ఆ మాటకు వస్తే క్రికెట్ చరిత్రలో ప్రతి దశలోనూ వెస్టిండీస్, ఇంగ్లండ్, ఆస్ట్రేలియా, భారత్ లాంటి జట్ల మధ్య పోటీనే ఆటను తీర్చిదిద్దినట్టు కనిపిస్తుంది. ఇక విదేశాల్లో ఫుట్‌బాల్, బేస్‌బాల్ లాంటి ఆటల కోసం ఏర్పడే క్లబ్స్ మధ్య పోటీ అటు క్రీడాకారులకీ, ఇటు ప్రేక్షకులకీ పండగలా కనిపిస్తుంది. జో ఫ్రేజర్ అనే బాక్సింగ్ దిగ్గజంతో జరిగిన ఆధిపత్య పోరే మహమ్మద్ అలీని అత్యుత్తమ బాక్సర్‌గా తీర్చిదిద్దింది.

ఇవే కాదు పాటల ప్రపంచంలో (మైకేల్ జాక్సన్ X ప్రిన్స్), కవుల లోకంలో (కీట్స్ X బైరన్), వెండితెర మీద (ఆర్నాల్డ్ ష్వాజ్‌నెగర్ X సిల్వెస్టర్ స్టలోన్)... ఇలా ప్రతీచోటా పోటీతత్వం ఆ రంగం పట్ల ఆకర్షణనే పెంచింది.



